క్లుప్తంగా

క్రీడా దుస్తులు అందజేత



దుస్తులను అందజేస్తున్న సభ్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్ర ప్రో కబడ్డీ కర్నూల్ నైట్స్ కబడ్డీ టీమ్‌కు క్రీడా దుస్తులను అసోసియేషన్ సభ్యులు గురు శేఖర్, శ్రీవాణి అందజేశారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న కర్నూలు నైట్ ఫ్రాంచైజీకు చెందిన క్రీడాకారులకు ఆదివారం ఈ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రో కబడ్డీ లీగ్‌లో క్రీడాకారులు తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీధర్, సుమలత పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ ఎన్నిక ఏకగ్రీవం

కడప రూరల్: ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సిద్ధవటం తాలూకా యూనిట్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా జె.సుబ్బరాయుడు, సహ అధ్యక్షుడిగా వై.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్.యానాదయ్య, పి.భాస్కర్‌రెడ్డి, శారద, కె.పవన్‌కుమార్, కార్యదర్శిగా సి.హైమావతి, జాయింట్ సెక్రటరీలుగా అంజనమ్మ, సల్మాన్‌రాజు, లక్ష్మినరసింహా, వెంకట రమణ, కోశాధికారిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా తిమ్మారెడ్డి, సహాయ ఎన్నికల అధికారి పోల్‌రెడ్డి, పరిశీలకులుగా రవికుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసులు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

క్రీడా పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శాప్ డైరెక్టర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివారులోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలను శాప్ డైరెక్టర్ రమణరావు, పేరం రవీంద్రనాథ్ ఆదివారం తనిఖీ చేశారు. ఉదయం క్రీడా పాఠశాలకు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, వసతి ఏవిధంగా ఉన్నాయో పరిశీలించారు. క్రీడా మైదానాలను పరిశీలించి అక్కడ ఉన్న లోటుపాట్లను గుర్తించారు. కోచ్‌లు ఏవిధంగా శిక్షణ ఇస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు కె.జగదీశ్వరి, బొమ్మినేని శివ, క్రీడా పాఠశాల కోచ్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓ సేవలు మరువలేనివి




వెంకటసుబ్బయ్య దంపతులకు సన్మానం

కడప ఎడ్యుకేషన్: ఒంటిమిట్ట ఎంఈఓ సేవలను మరువలేనివని వేంపల్లి ఎంఈఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఒంటిమిట్ట ఎంఈఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన వెంకటసుబ్బయ్యను కడప ఆర్ఎల్‌టీ పంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య సర్వీసులో నిబద్ధత, నిజాయితీతో పనిచేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారన్నారు. మండలంలోని ఉపాధ్యాయులందరితో సమన్వయం చేసుకుంటూ చక్కటి ఫలితాలను సాధించారన్నారు. అనంతరం వెంకటసుబ్బయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీ, గంగిరెడ్డి, నాగమునిరెడ్డి, జాఫర్, సాదిక్, నారాయణ, రత్నం, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

కడప అర్బన్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లి ప్రాంతంలో వన్ టౌన్ పోలీసుల ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనం రికార్డులను క్షుణ్ణంగా ఎస్సై అమర్నాథ్ రెడ్డి పరిశీలించారు. పెండింగ్ చలానాలు, సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. పెండింగ్ జరిమానాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 2000–2001 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 24 సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకొని చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తోటి విద్యార్థి మృతి చెందడంతో ఆకుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేదని తెసుకొని తోటి విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతోఈరోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

● ఎక్కడపడితే అక్కడ నిలుస్తున్నాయ్

నగర పాలక సంస్థ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు మరమ్మతులకు గురై ఎక్కడపడితే అక్కడ నిలుస్తున్నాయి. నిత్యం కడప నగరంలో చెత్త కుప్పలను పారిశుద్ధ కార్మికులు సేకరించి వాహనంలో లోడ్ చేస్తే ఆ వాహనం చింతకొమ్మదిన్నె మండలం కొలుముపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు తరలిస్తుంటుంది. నగర పాలక సంస్థ అధికారులు ఈ వాహనాలకు సక్రమంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లపై ఆగిపోతున్నాయి. సిబ్బంది చేసేదేమీలేక అక్కడే వాహనాలను నిలిపివేస్తున్నారు. అధికారుల అనుమతి వచ్చిన తర్వాత వాటికి మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

– కడప వైఎస్ఆర్ సర్కిల్



విద్యార్థి సంఘాల అణచివేతే లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ పాఠశాల విద్యా మండలి కార్పొరేట్ విద్యా సంస్థలను కాపాడేందుకు తెచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. కడపలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వతేదీన జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మినహాయిస్తే ఇతరులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడం, తరగతి గదుల్లోకి వెళ్లడం, విద్యార్థులతో సంభాషించడం నిషేధించినట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను హరించడం విద్యార్థి సంఘాలను నియంత్రించడం, వాటి గొంతును అణచివేయడమే లక్ష్యంగా ఉన్న ఆ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలైన శ్రీచైతన్య, నారాయణ, భాష్యం విద్యా సంస్థలను కాపాడడం కోసం ఈ ఉత్తర్వులను తీసుకురావడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సరైన భవనాలు, ఆట స్థలాలు, కాంపౌండ్ వాల్స్‌తోపాటు తగినంతమంది ఉపాధ్యాయులు లేక సంక్షోభంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతి యూనిఫామ్‌లు, షూలు, ఐడీ కార్డులు, పుస్తకాల పేరుతో శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం వంటి పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అన్యాయాలను ప్రశ్నించడం, సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టడం ప్రభుత్వానికి సహించరానిదిగా మారిందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో (నారాయణ, చైతన్య, భాష్యం)విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరిన సంఘాల గొంతు నొక్కేందుకే ఇలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే విధంగా విద్యార్థి ఉద్యమం ఉంటుందని వారు హెచ్చరించారు.

రాయల్ ఓక్ ద్వారా నాణ్యమైన ఫర్నిచర్



షోరూంను ప్రారంభిస్తున్న చంద్రఓబుల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: దేశ వ్యాప్తంగా విశేష గుర్తింపు కలిగిన రాయల్ ఓక్ సంస్థ నాణ్యమైన వస్తు సామాగ్రికి మారుపేరు అని కందుల గ్రూప్ విద్యా సంస్థల అధినేత కందుల చంద్రఓబుల్‌రెడ్డి తెలిపారు. కడప బిల్టప్ సర్కిల్ వద్ద నూతన రాయల్ ఓక్ షోరూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫర్నిచర్ రంగంలో రాయల్ ఓక్ తన ప్రత్యేకత చాటుకుంటోందన్నారు. మన్నికతో కూడి తక్కువ ధరలకు ఫర్నిచర్ అందుబాటులో ఉండడం ఈ షోరూం ప్రత్యేకత అన్నారు. షోరూంలో ప్రజల అభీష్టానానికి అనుగుణంగా అమెరికన్, ఇటాలియన్, జర్మనీ, ఇండియన్ స్టాండెడ్స్‌తో కూడిన ఫర్నిచర్ ఏర్పాటు చేయడం మరింత సంతోషదాయకమన్నారు. క్వాలిటీ పరంగా మన్ననలు పొందేలా రకరకాల దేశాల నుంచి వచ్చిన సోఫాలు, డైనింగ్ టేబుల్స్, మంచాలు ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. ప్రతి ఒక్కరూ రాయల్ ఓక్ షోరూంను సందర్శించి తమకు నచ్చిన ఫర్నిచర్ కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం షోరూం ప్రతినిధి నాని తమ షోరూం, ఫర్నీచర్ ప్రత్యేకతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ ఓక్ సంస్థ చైర్మన్‌విజయ్ సుబ్రహ్మణ్యం, ఎండీ మదన్ సుబ్రహ్మణ్యం, కిరణ్ చబారియా, తమ్మయ్య కొటేరా, వినోద్, ఫ్రాంచైజీ యజమానులు నాని, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

కడప వైఎస్ఆర్ సర్కిల్: తమకు వేతనాలను పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ అన్నారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 డిసెంబర్, 12 నుంచి 42 రోజుల పాటు సమ్మె చేపడితే.. వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తమ వేతనాలు పెరగలేదన్నారు. పైగా యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేయడం, ఇబ్బందులకు గురిజేయడం నిత్యం జరుగుతోందని ఆరోపించారు. వెంటనే వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మీదేవి, అంజలీదేవి, మనోహర్, శ్రీనివాసరెడ్డి, సావిత్రి, వెంకటసుబ్బయ్య, విజయ, చంటమ్మ, విజయ, కవిత, రామసుబ్బమ్మ, శైలజ, రాజేశ్వరి జ్యోతి, కుసుమ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ?



మాట్లాడుతున్న వీరణాల శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎన్నికల హామీలలో భాగంగా యువతకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా యువతకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, ఏడాది దాటినా ఆ ఊసేలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత కోచింగ్ సెంటర్లలో సంవత్సరాల తరబడి గడుపుతూ ఆర్థిక భారంతో ఇబ్బందిపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సూపర్‌సిక్స్ లో భాగంగా నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సునీల్ పాల్గొన్నారు.

కుక్కల బెడద.. కోతులతో దడ

- భయపెడుతున్న వానరాలు
- హడలెత్తిస్తున్న శునకాలు



ఇంటి వద్ద తిష్ట వేసిన కోతులు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

సిద్ధవటం: సిద్ధవటంలో కోతులు కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రజలు బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు రావాలన్నా, పోవాలన్నా కుక్కలు, కోతులు దాడి చేస్తాయని బెదిరిపోతున్నారు. ఒకటి రెండు కాదు పదుల సంఖ్యలో వీధులలో తిరుగుతూ ప్రజలపైకి దూకుతున్నా . దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు నివాస ప్రాంతాలకు వచ్చి గృహాలను గుల్ల చేస్తున్నాయి. ఒక వైపు కోతుల బెడద అయితే మరో వైపు కుక్కల గుంపు తోడైంది.

పెరుగుతున్న బాధితులు

కుక్కలు కూడ పదుల సంఖ్యలో భౌ..భౌ.. అంటూ ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కుక్క దాడిలో ప్రాణాలు, గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రెండు జంతువుల ఆగడాలకు అడ్డుకట్టవేయలేని పరిస్థితులు వచ్చాయి. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో కోతులను, కుక్కలను పట్టుకునేవారు వచ్చినప్పటికీ అధికారుల మధ్య ధర కుదరలేదని కోతులు పట్టేవారు వెళ్లిపోయారు. దీంతో వాటి సంతతి రోజురోజుకు పెరిగిపోతోంది. గ్రామంలో రాత్రి, పగలు అని తేడా లేకుండా రోడ్లపై కుక్కలు స్వైర్వ విహారం చేస్తున్నాయి. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వారిని కరుస్తున్నాయి. కోతుల, కుక్కల బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. అధికారులు స్పందించి కోతులను, కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు.

పురాతన కోనేరుకు స్వచ్ఛీకరణ



పూడిక తొలగిస్తున్న భక్తులు

చింతకొమ్మదిన్నె : జిల్లాలో పురాతన కాలంలో బృగుమహర్షి తపస్సు చేసుకుంటూ అయన చేత నిర్మాణం చేపట్టినట్లుగా భావిస్తున్న కోనేరుకు తిరిగి ఆదివారం స్వచ్ఛీకరణ చేశారు. మండలంలోని బుగ్గలపల్లె సమీపంలోని బుగ్గమల్లేశ్వర ఆలయం ఉంది. ఆలయంలోని దేవతలకు పూజలకు అవసరమైన నీటి కోసం నిర్మించిన కోనేరు శిథిలావస్థకు చేరింది. బుగ్గలపల్లె, నాగిరెడ్డిపల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గఅగ్రహారం, కడప నగరం నుంచి భక్తులు వచ్చి స్వచ్ఛందంగా ఈ కోనేటిలో పూడికను తీశారు. ఈ కార్యక్రమంలో గూడా ప్రభాకరరెడ్డి, సదానందరెడ్డి, బొగ్గడి సుధాకరరెడ్డి, భాస్కరరెడ్డి, చుట్టుపక్కల గ్రామస్తులతోపాటు ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి అభిషేకాలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయం, శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలలో పూజలు చేశారు.

శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలి

కడప అర్బన్: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శిల్పారామం సందర్శకులకు 'శక్తి' యాప్ గురించి రిమ్స్ పీఎస్ ఎస్.ఐ సుభాష్ చంద్రబోస్ తెలియజేశారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి మహిళ, బాలికలు సెల్‌ఫోన్లో ప్లే స్టోర్‌లో ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారని తెలిపారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసు వారు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ పి.ఎస్ ఎస్.ఐ సూచించారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోనిని బుగ్గవంక సమీపంలో మేకలను కాస్తున్న చాంద్‌బాషా(17)పై కొందరు యువకులు ఆదివారం రాత్రి సమయంలో కత్తితో దాడి చేశారు. మేకలు, ఎనుములు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. సాయంత్రం వరకు మేకలను, ఎనుములను మేపిన తరువాత తనకు దొరికిన పాత ఇనుప కడ్డీలు, ఇతర సామగ్రిని పాతసామాన్ల దుకాణం వారికి విక్రయించి డబ్బులను సంపాదించుకునేవారు. ఈ క్రమంలో చాంద్‌బాషాపై కొందరు యువకులు దాడి చేసి గాయపరిచారు. ప్రస్తుతం అతను రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి యువత రాజకీయాల్లోకి రావాలి



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ కనుసన్నలో నడుస్తున్న పాలక పార్టీల అవినీతి రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి యువత ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర అన్నారు. నగరంలోని ఎర్రముక్కపల్లి సర్కిల్ వద్ద కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈశ్వర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన చంద్ర మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం యావదాస్తిని త్యాగం చేసిన నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్ రెడ్డి అన్నారు. అధికారమే పరమావధిగా భావించే నేటిక పాలక పార్టీల అభ్యర్థులు ఒకరికి మించి ఒకరు కోట్ల రూపాయలు కుమ్మరించి గెలిచినందున రాజకీయ అవినీతికి బీజం పడిందన్నారు. తమ పార్టీ విధి విధానాలను పక్కనపెట్టి కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడుపోయి అవినీతి రాజకీయాలను పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు లెక్క చేయకుండా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఈశ్వర్‌రెడ్డిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వతంత్ర సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ అమలుచేస్తూ ప్రాంతాల మధ్య చిచ్చుచేపి నిరంకుశ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, చెన్నకేశవరెడ్డి, నాగార్జున రెడ్డి, యన్.వెంకటశివ, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, కేసీ. బాదుల్లా, మద్దిలేటి, మనోహర్‌రెడ్డి, సావంత్ సుధాకర్, సిఆర్‌వి.ప్రసాద్, శ్రీకష్ణ, రాము, బందెల ఓబయ్య, ఫణిరాజు, రామ్మోహన్ రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌పై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న పాకా సురేష్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో చెత్త పన్ను వసూళ్లలో జరిగిన అవినీతిపై అడిషనల్ కమిషనర్‌ను తొలగించి సమగ్ర విచారణ చేయాలని 47వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ చెత్తపన్ను వసూలు చేయడం ప్రారంభించినపుడు పాలకవర్గం అనుమతి తీసుకోలేదన్నారు. అనంతరం ఒకవేళ వసూలు చేయాల్సి వస్తే రూ.50 మాత్రమే తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించామన్నారు. దానిని పక్కనపెట్టి అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వసూలు చేశారన్నారు. చెత్త పన్ను ఎంత వసూలు చేశారు? ఎప్పటి నుంచి... వసూలు చేస్తున్నారు? అ డబ్బు ఎక్కడ కట్టారో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పాలకవర్గాన్ని నిర్లక్ష్యం చేసి ...అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ తనకు కావాల్సిన వాళ్లను చుట్టూ నియమించుకొని వసూలుచేయడం జరిగిందని ఆరోపించారు. 2022 క్లాప్ ప్రోగ్రామ్ ప్రారంభం అయినప్పటి నుండి ఏ నెల ఎంత వసూలు చేశారో కాంట్రాక్టర్‌కు ఎంత చెల్లించారో లెక్కలు చూపాలన్నారు. వసూలు చేసిన మొత్తం కాకుండా సాధారణ నిధుల నుంచి ఎంత మొత్తం కాంట్రాక్టర్‌కు చెల్లించారో చెప్పాలన్నారు. అడిషనల్ కమిషనర్‌ను విధుల నుంచి తప్పించినప్పుడే విచారణ సక్రమంగా జరుగుతుందని భావించినా, తూతూమంత్రంగా చేపట్టారన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకూ కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారేగానీ అసలైన దోషులను వదిలేశారన్నారు. కలెక్టర్ స్పందించి చెత్త పన్ను వసూళ్లలో అవినీతిపై పారదర్శకంగా విచారణ చేయించాలని కోరారు. ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ చేపట్టిన ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీఎం చంద్రబాబు రాయలసీమ వ్యతిరేకి



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ వ్యతిరేకి అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాయలసీమలో పుట్టినప్పటికీ ఆ ప్రాంత ప్రయోజనాలను కాపాడేలా ఏనాడూ నిర్ణయాలు తీసుకోలేదన్నారు. 1997లో సీఎంగా ఉన్న చంద్రబాబు గాలేరు–నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) గండికోట ప్రాజెక్టుకు శ్రీక్రిష్ణ కమిటీ వేసి అది సాధ్యం కాదని నివేదిక పంపారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న డా. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, మైసూరారెడ్డి పాదయాత్ర చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే ఆ జీవోను రద్దు చేయించారన్నారు. 1998 ఎన్నికల సమయంలో గండికోటకు శంకుస్థాపన చేసి 2004 వరకూ ఒక రూపాయి ఖర్చు పెట్టిన పాపాన పోలేదన్నారు. 2004లో డా.వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచి గండికోట ప్రాజెక్టు పూర్తి చేశారన్నారు. వెలుగోడు, హంద్రీనీవా, బ్రహ్మంసాగర్, పైడిపాళెం, సర్వరాయసాగర్ మొదలకు ప్రాజెక్టులను 90 శాతం పూర్తి చేశారన్నారు. 2012లో అనంత వెంకటరామిరెడ్డి, రఘువీరారెడ్డి పోతిరెడ్డిపాడు నుంచి జీడీపల్లె కాలువ వెంబడి పాదయాత్ర చేస్తే నీళ్లు ఇచ్చారన్నారు. 2014–19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుప్పానికి నీళ్లు తీసుకెళ్లలేదన్నారు. 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కుప్పానికి హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీళ్లు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం వరదలు వచ్చి రెండు నెలలు అవుతున్నా గండికోట, పైడిపాళెం, బ్రహ్మంసాగర్ మొదలగు ప్రాజెక్టులకు నీరు నింపలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా కేంద్రమిచ్చే సాయంతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని చెప్పారని, ఒక ఏడాది సొమ్ము ఎగ్గొట్టి కేవలం రూ.5 వేలు మాత్రమే ఇపుడు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నిత్యానందరెడ్డి, పాకా సురేష్ పాల్గొన్నారు.

ఈశ్వర్‌రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితం



నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కమలాపురం: కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి జీవితం ప్రజా సేవకే అంకితం అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్, ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన 39వ వర్ధంతిని పురస్కరించుకుని కమలాపురం క్రాస్ రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి తన జీవితమంతా ప్రజలకే అంకితం చేశారన్నారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ఆయన చివరి శ్వాస వరకు పేదల పక్షాన పోరాడారని గుర్తు చేశారు. 1946లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపినప్పటికి చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పార్టీని నడిపించారన్నారు. 1949–52 మధ్య కమ్యూనిస్ట్ పార్టీపై తీవ్ర నిర్బంధన ఉన్నపుడు ఆయన అజ్ఞాత వాసంలో ఉండగా ఆయనతో పాటు మరో కామ్రేడ్‌ను అరెస్ట్ చేయడానికి 1949 సెప్టెంబర్ 28న పోలీసులు ఆయన గ్రామానికి వచ్చినప్పుడు ప్రజలు తిరుగుబాటు చేసి పోలీసుల కళ్లల్లో కారం కొట్టి, రాళ్లతో దాడి చేశారన్నారు. ఈయన 1915లో పెద్దముడియం మండలం పెద్దపసుపులలో జన్మించారని, కడప జిల్లాకు మొదటి ఎంపీగా 1952లో సీపీఐ తరపున గెలిచారన్నారు. 1958 నుంచి 1962 వరకు ఎంఎల్‌సీగా సేవలందించారన్నారు. ఆ తర్వాత 3 సార్లు ఎంపీగా గెలిచారన్నారు. 1986లో ప్రొద్దుటూరులోని సీపీఐ కార్యాలయంలో కన్ను మూశారన్నారు. ప్రజా పోరాటాలకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన పేరును గండికోట ప్రాజెక్ట్‌కు పెట్టడం హర్షణీయం అన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తాం



సమావేశంలో ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక విషయాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ అన్నారు. కడప పట్టణంలోని నాగార్జున మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.25 వేల కోట్లకు పైగా ఆర్థిక బకాయిల విడుదల, ఐదు పెండింగ్ డీఏల విడుదల, పీఆర్సీ కమిషన్ వేసి మధ్యంతర భృతిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల బకాయిలపై ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళనకరం అన్నారు. 12వ వేతన సవరణకు సంబంధించి వెంటనే సిట్టింగ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య మాట్లాడుతూ విద్యాశాఖ వింత పోకడలతో నడుస్తుందన్నారు. ఐచ్ఛిక సెలవులను ఎప్పుడూ లేనివిధంగా వ్యక్తిగతంగా వాడుకోవాలనడం, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఇతర డిపార్టుమెంట్ అధికారుల జోక్యం కల్పించడం తగదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు, హెల్త్ కార్డులతో మెరుగైన వైద్యం వంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసి అన్ని కేడర్ల వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకలరెడ్డి, శ్రీనివాసులు, బాలానాయుడు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో కిశోర్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో హోరెత్తించారు. పలు పాటలకు వారు చేసిన నృత్యాలకు సందర్శకులు కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు. శిల్పారామం పాలనాధికారి కృష్ణప్రసాద్, మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.